హారర్ స్టోరీ

# నో ఎండ్

**హఠాత్తుగా మెలుకువ వచ్చింది బెనర్జీకి. అసలే చలి కాలం, అందులోనూ ఎయిర్ కండీషన్డ్ గది... అయినా అతనికి ఉక్కపోతగా వుంది. సీలింగ్ ఫ్యాన్ కూడా తిరుగుతోంది. అయినా తనకు ఉక్కపోస్తోంది. నైట్ గౌనులో వున్న బెనర్జీ బెడ్‌రూమ్ డోర్ ఓపెన్ చేసి హాలులోకి వచ్చాడు. గుమ్మం తలుపులు తెరిచే వున్నాయి. తను ఆ తలుపులు మూసి గొళ్లెం పెట్టినట్టు గుర్తు.**

స్లిప్పర్స్ వేసుకొని బయటకు నడిచాడు. స్ట్రీట్ లైట్ల వెలుతురులో రోడ్డు నిర్మానుష్యంగా కనిపిస్తోంది. రిస్ట్‌వాచీ వంక చూసుకున్నాడు. టైం అర్ధరాత్రి పన్నెండు గంటలను సూచిస్తోంది. ఆ టైంలో మామూలుగా అయితే జనం వుండాలి. ఒకటి రెండు కుక్కలు తరచూ మొరుగుతూ వుంటాయి.

తలంతా దిమ్ముగా వున్నట్టు అనిపించింది. వేడి వేడిగా టీ తాగాలని అనిపించింది. పాలు ఉదయమే పిల్లి తాగినట్టు గుర్తొచ్చింది. ఆ పక్కనే ఇరానీ హోటల్ వుంది. అర్ధరాత్రి రెండు గంటల వరకూ తెరిచే వుంటుంది.

బెనర్జీ టీ తాగాలని నిర్ణయించుకున్నాక, ఇరానీ హోటల్ వైపు నడిచాడు. కొన్ని అడుగులు వేసేక, ఆశ్చర్యంతో అతని నొసలు ముడిపడింది. రోడ్డుకు ఎడమవైపు వున్న బ్యాంకు ఒకటి తెరిచే వుంది. అది నైట్ బ్యాంక్ కూడా కాదు. బ్యాంకు ముందు సెంట్రీ కూడా లేడు. చిన్నపాటి ఆశ్చర్యంతో బ్యాంకు లోపలికి అడుగుపెట్టి, మరింత ఆశ్చర్యానికి గురయ్యాడు.

బ్యాంకులో సిబ్బందిగానీ, కస్టమర్లుగానీ లేరు. పైన సీలింగ్ ఫ్యాన్లు తిరుగుతున్నాయి. టేబుల్ మీద వున్న పేపర్లు ఎగురుతున్నాయి. గోడకు వున్న క్యాలెండర్ అటూ, ఇటూ వూగుతూ శబ్దం చేస్తోంది. బెనర్జీ పేపర్లు ఎగిరిపోకుండా పేపర్ వెయిట్ పెట్టాడు. మేనేజర్ గది, స్ట్రాంగ్ రూమ్... అన్నీ ఓపెన్‌గానే వున్నాయి. చిన్నపాటి ఉద్వేగానికి లోనయ్యాడు బెనర్జీ. వెంటనే బ్యాంకులో నుంచి బయటకు వచ్చాడు.

ఇప్పుడు తనేం చేయాలి? పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేస్తే...

అవును...

అదే మంచిది.... లేకపోతే ఏ దొంగలో బ్యాంకును దోచుకుంటారు. వెంటనే మళ్లీ బ్యాంకు లోపలికి వెళ్లబోయి, ఒక్క క్షణం ఆగిపోయాడు. ఎదురుగా టెలిఫోన్ బూత్... అక్కడ జనం ఎవరూ లేరు. రోడ్డు దాటి అటువైపు వెళ్లాడు. ఓపెన్ చేసి వున్న టెలిఫోన్ బూత్‌లో మనుషులు లేకపోవడమేమిటి? వెంటనే రిసీవర్ ఎత్తి కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసాడు.

ఫోన్ రింగవుతోంది. కానీ ఎవరూ లిఫ్ట్ చేయడం లేదు. అతని శరీరం మరోసారి స్వేదంతో నిండిపోయింది. అప్పుడు గమనించాడు, ఎదురుగా కిళ్లీ కొట్టు తెరిచే వుంది... ఎవ్వరూ లేరు. అరటిపళ్ల బండి వుంది... ఎవ్వరూ లేరు... ట్రాన్స్‌లో వున్నట్టుగా నడుస్తున్నాడు. ఇరానీ హోటల్ వచ్చింది. కౌంటర్లో ఎవరూ లేరు. టేబుళ్లు ఖాళీగా వున్నాయి. ప్రతి టేబుల్ మీద పొగలు కక్కే టీ వుంది. మంచినీళ్ల గ్లాసూ వుంది. సప్లయర్లు లేరు. ఓనర్ లేడు.

హోటల్‌లో వున్న కిచెన్ రూమ్‌లోకి నడిచాడు. పొయ్యి మీద టీ డికాక్షన్ మరుగుతోంది. పెద్ద మంట. జనం లేరు. వెంటనే వెనక్కి వచ్చేసాడు.

ఇరానీ హోటల్ ఎదురుగా బస్ స్టాండ్... వరుసగా బస్సులన్నీ వున్నాయి. అన్నీ స్టార్ట్ చేయబడి వున్నాయి. డ్రైవర్లు, కండక్టర్లు, ప్రయాణీకులు లేరు.

భయంతో అతని కనులు పెద్దవయ్యాయి. బస్‌స్టాండ్ ఎదురుగా వున్న రైల్వేస్టేషన్‌లోకి అడుగుపెట్టాడు. టి.సి. లేడు. బుకింగ్ క్లర్క్ లేడు. ప్రయాణీకులు లేరు.

ఏమిటిదంతా...?

అతనికంతా అయోమయంగా వుంది.

సరిగ్గా అప్పుడే ఓ రైలు ప్లాట్‌ఫామ్ మీదికి వచ్చింది. ''హమ్మయ్య'' అంటూ నిట్టూర్చి ట్రెయిన్‌లో నుంచి దిగే ప్రయాణీకుల కోసం చూస్తున్నాడు. అతనికి మనుషులను చూస్తే తప్ప స్థిమితంగా వుండేలా లేదు.

రైలు ఆగింది... చిత్రంగా ప్రయాణీకులు ఎవ్వరూ దిగలేదు. ఆ మాటకొస్తే ప్రయాణీకులే లేరు ఆ రైలులో.

బెనర్జీ రైలు దగ్గరకి పరుగెత్తి అన్ని కంపార్ట్‌మెంట్లు చెక్ చేసాడు. అన్నీ ఖాళీ కంపార్ట్‌మెంట్లే. ఇంజన్ దగ్గరికి పరుగెత్తాడు. ఇంజన్‌లో వుండవలసిన డ్రైవర్ లేడు. రైలు నెమ్మదిగా కదులుతోంది. కొద్ది క్షణాల్లోనే రైలు ఆ స్టేషన్‌ని విడిచిపెట్టింది.

అప్పుడు మొదలైంది బెనర్జీలో భయం... అర కిలోమీటర్ దూరంలో వుంది పోలీస్ కంట్రోల్ రూమ్... అక్కడికి పరుగెత్తాడు. కంట్రోల్ రూమ్‌లో ఎవరూ లేరు. లైట్లు వెలుగుతున్నాయి. ఫోన్లు అదే పనిగా మోగుతున్నాయి. అయినా పోలీసులు లేరు.

బెనర్జీ భయంతో ఇంటివైపు నడిచాడు. తను రోజూ చూసే రోడ్లు, రోజూ చూసే షాపులు, రోజూ చూసే హోటళ్లు, బస్సులు. అయినా కిక్కిరిసి వుండే జనం లేరు.

ఏమిటీ మిస్టరీ?

సడన్‌గా వెనక నుంచి హారన్.

ఉలిక్కిపడి పక్కకు జరిగాడు. ఓ బైక్ తనని రాసుకుంటూ వెళ్లింది. కోపంగా అటువైపు చూసి భయంతో బిగుసుకుపోయాడు. బైక్ మీద ఎవరూ లేరు. కానీ బైక్ వెళ్తోంది.

తనకివ్వాళ ఏమైంది? పోనీ తన ఎదురింట్లో వుండే వెంకట్రావ్‌ని కలుసుకుంటే...

వెంటనే వెంకట్రావ్ ఇంటివైపు పరుగెత్తాడు. ఆ ఇంటి తలుపులు తెరిచే వున్నాయి. వెంకట్రావ్ లేడు... అతని భార్య లేదు...

రెండు చేతులతో తల పట్టుకొని తన ఇంటివైపు నడిచాడు... హాలులోకి నడిచి ఎదురుగా వీల్‌చెయిర్‌లో వున్న వ్యక్తి వైపు చూసి భయంతో బిగుసుకుపోయాడు.

ఎదురుగా వీల్ చెయిర్‌లో ఓ వ్యక్తి చనిపోయి వున్నాడు. అతని మెడ దగ్గర రెండు గాట్లు... శరీరమంతా తెల్లగా పాలిపోయి వుంది. ఆ శవం బెనర్జీది.

వీల్ చెయిర్‌లో తన శవం వుండడం చూసి భయంతో కెవ్వున కేక వేసాడు బెనర్జీ.

★ ★ ★

ఉలిక్కిపడి కళ్లు తెరిచాడు బెనర్జీ. అలారం టైంపీస్ అదే పనిగా మోగుతోంది. చుట్టూ చూసాడు. తను నైట్ గౌన్‌లో వున్నాడు. తన కాళ్లకు స్లిప్పర్స్ వున్నాయి. హాలులోకి వచ్చాడు. గుమ్మం తలుపు వేసే వుంది. తలుపు తీసాడు. ఎదురింటి వెంకట్రావ్ బెనర్జీని పలకరించాడు.

★ ★ ★

ఉదయం పది గంటలు.

రోడ్డుమీదికి వచ్చాడు బెనర్జీ.

జనసంచారం... బ్యాంకు అప్పుడే తీస్తున్నారు. క్రితం రాత్రి చూసిన టెలిఫోన్ బూత్ ఇప్పుడు క్లోజ్ చేసి వుంది. ఇరానీ హోటల్‌లోకి అడుగుపెట్టాడు. బోయ్స్ టీ సప్లయ్ చేస్తున్నారు.

ఏమిటిదంతా...

తన భ్రమా...

ఒకటి కాదు... రెండు కాదు... సంవత్సర

కాలంగా తనకిలాంటి అనుభవాలే...

అయినా తను ఏమీ చేయడం లేదు. ఏదో ఒకటి చేయాలి...

★ ★ ★

'మల్హోత్రా... సైకాలజిస్టు...' అన్న బోర్డు చూసి చిన్నగా తలుపు తట్టి లోపలికి అడుగుపెట్టాడు బెనర్జీ.

యాభయ్యేళ్ళ మల్హోత్ర కళ్ళజోడులో నుంచి బెనర్జీ వైపు చూసి ''కూచోండి'' అన్నాడు.

బెనర్జీ కుర్చీలో కూర్చున్నాడు. మల్హోత్రా పరిశీనగా చూస్తున్నాడు బెనర్జీ వైపు. పాలిపోయిన మొహం... అతనిలో ఏదో ఓ భయాన్ని సూచిస్తోంది.

''చెప్పండి... ఏమిటి మీ ప్రాబ్లెం...?'' అడిగాడు గంభీరంగా మల్హోత్రా.


''నా ప్రాబ్లెం నేనే'' చెప్పాడు బెనర్జీ.

''వాట్... మీ ప్రాబ్లెం మీరా?''

''అవును... నేను సంవత్సరం క్రితం చనిపోయాను'' మెల్లిగా చెప్పాడు బెనర్జీ.

ఒక్క క్షణం హడలిపోయి, అదురుపాటుతో అడిగాడు. ''ఏమిటి మీరనేది?''

ముచ్చర్ల రజనీశకుంతల



''అవును... నేను చచ్చిపోయాను... రాత్రి పూట నా ప్రపంచంలో ఎవ్వరూ కనిపించరు... ఐ మీన్ మనుషులు.''

''మీరు నాతో మాట్లాడుతూనే వున్నారుగా. చనిపోయానని ఎలా అంటున్నారు?'' అతని మానసిక స్థితిని అంచనా వేయడానికి ప్రయత్నిస్తూ అడిగాడు మల్హోత్రా.

''అదే నాకు అర్థం కావడం లేదు...'' అంటూ రాత్రి జరిగిన సంఘటన చెప్పి- ''ఇలా సంవత్సరకాలంగా జరుగుతోంది'' అన్నాడు.

''అందువల్ల మీరు చనిపోయారని నిర్ణయించుకున్నారా?'' చిన్నగా నవ్వుతూ అడిగాడు.

''కాదు... ఇవ్వాళే ఈ పుస్తకం మా స్టోర్ రూమ్‌లో దొరికింది. ఇది చదివేక తెలిసింది.''

''ఏమిటా పుస్తకం?'' అతనిచ్చిన నలుపురంగు అట్టతో వున్న పాతబడిన పుస్తకాన్ని చేతిలోకి తీసుకుంటూ అడిగాడు.

''విషాచి ఆవాహన'' చెప్పాడు బెనర్జీ.

''విషాచా... ఇలాంటి క్షుద్ర పుస్తకాలను నమ్ముతారా? విషాచి అంటే ఏమిటో మీకు తెలుసా?''

''తెలుసు... చెడు కోరికలను ఆవహించే క్షుద్ర శక్తి...''

''అయితే...''

''వాంపయిర్‌లా తన కోరలను శరీరంలో దించేసి, ఆ వ్యక్తిని తనలో కలుపుకొని, క్షుద్ర ప్రపంచంలోకి ఆహ్వానిస్తుంది.''

నవ్వాడు మల్హోత్రా.

''దీనిని హెలూసినేషన్ అంటారు. భ్రమ... ఒక విధమైన మాస్ హిస్టీరియా లాంటిదే... ఒక్కోసారి ఇలాంటి భ్రమలు నైట్‌మేర్‌లుగా... అంటే పీడ కలలుగా మారుతాయి. ఎప్పుడూ అదే ఆలోచన... అదే మిమ్మల్ని ఇలా తయారుచేసింది'' చెప్పాడు నవ్వుతూనే.

బెనర్జీ చురుగ్గా మల్హోత్రా వైపు చూసి- ''అంటే నేను చెప్పేది మీరు నమ్మడం లేదు కదూ...?'' అన్నాడు.

''అయామ్ సారీ... మిమ్మల్ని బాధపెట్టే వుద్దేశం లేదు. మీరు భయంకరమైన భ్రమలో వున్నారు.

ఆల్‌రైట్... ఈరోజు రాత్రి మీతోపాటు నేనూ మీ ఇంటికి వస్తాను. మనమిద్దరం మీరు చెప్పిన నిర్మానుష్యమైన ప్రపంచాన్ని చూద్దాం... సరేనా?'' అనునయంగా చెప్పాడు.

''సరే...'' అన్నాడు బెనర్జీ.

★ ★ ★

మెడికల్ జర్నల్ చదువుతున్న మల్హోత్రాకు ఆవలింతలు వచ్చేసాయి. బెనర్జీ ఇంటికి వచ్చి అప్పటికే రెండు గంటలు అయింది. బెనర్జీ బెడ్‌రూమ్‌లో మంచం మధ్యలో కూర్చున్నాడు.

మల్హోత్రా బెనర్జీ వైపు చూసి ''నిద్రొస్తోందా?'' అని అడిగాడు.

''కాదు... దాహం వేస్తోంది'' చెప్పాడు బెనర్జీ.

''ఫ్రిజ్ ఎక్కడ వుంది?''

''హాలులో... కానీ నాకు భయం వేస్తోంది.''

''నేను తెస్తాను...'' అంటూ హాలు వైపు నడిచాడు మల్హోత్రా. ఫ్రిజ్ ఓపెన్ చేసి ఒక్క క్షణం స్థాణువయ్యాడు. ఫ్రిజ్ లోపల మెట్లున్నాయి. ఓసారి కళ్లు నులుముకుని మెల్లిగా లోపలికి అడుగు పెట్టాడు. ఫ్రిజ్ డోర్ క్లోజయింది.

మల్హోత్రా మెట్లు దిగి వచ్చేసరికి రోడ్డు కనిపించింది. బెనర్జీ ఇంటి ఎదురుగా వున్న రోడ్డు... కొద్దిగా ముందుకు వెళ్ళాడు. రోడ్డు పక్కనే వున్న బ్యాంక్ తెరిచే వుంది... ఇరానీ హోటల్ తెరిచే వుంది. జనం లేరు...

మల్హోత్రా కళ్లు భయంతో వెడల్పయ్యాయి. రైల్వేస్టేషన్‌లోకి పరుగెత్తాడు. ప్రయాణీకుల్లేరు. పోలీస్ స్టేషన్ వైపు పరుగెత్తాడు. అక్కడా ఎవరూ లేరు.

భయంతో పరుగెడుతున్నాడు... పరుగెత్తి... పరుగెత్తి... అలసిపోయాడు. ఒక్క క్షణం ఆయాసం తీర్చుకోవడానికి అక్కడే నిలబడి... రెండు నిమిషాల తర్వాత కళ్లు తెరిచి చూసాడు. బెనర్జీ ఇంటి ముందున్నాడు తను. తలుపులు తెరిచే వున్నాయి.

హాలు లోపలికి వచ్చాడు. బెనర్జీని పిలవబోతూ, ఒక్క క్షణం ఎదురుగా గోడకు వున్న ఫొటోల వైపు చూసాడు.

వరుసగా కొన్ని ఫొటోలు వున్నాయి. ఫొటోల కింద జనన మరణాల తారీఖులు, సంవత్సరాలు వున్నాయి.

అతని దృష్టి చివరి ఫొటో మీద పడింది.

ఆ ఫొటో బెనర్జీది...

జననం: 13-10-1953,

మరణం: 13-10-2002 అని వుంది.

అంటే బెనర్జీ చనిపోయి ఆవేళ్టికి సంవత్సరం. సరిగ్గా అప్పుడే ఏదో శబ్దం.

వీల్ చెయిర్ శబ్దం... వీల్ చెయిర్‌లో కూర్చుని వున్నాడు బెనర్జీ. వీల్ చెయిర్ కదులుతూ వస్తోంది మల్హోత్రా వైపు. బెనర్జీ శవం మల్హోత్రా వైపే చూస్తోంది.

బెడ్‌రూమ్‌లో ఎవరో రోదిస్తున్నట్టు...

కౌంట్ డౌన్.

నాలుగు...

మూడు...

రెండు...

ఒకటి...

ఆ హాలు తలుపులు మూసుకున్నాయి.


మల్హోత్రా వేసిన కేక ఆ ఇంట్లో ప్రతిధ్వనించింది.

★ ★ ★

సరిగ్గా ఈ సంఘటన జరిగిన సంవత్సరం తర్వాత ఓ ఇన్‌స్పెక్టర్‌ని ఆ ఇంటికి తీసుకువచ్చాడు మల్హోత్రా... కథ మళ్ళీ మొదలు... నో ఎండ్...

పిశాచి తన క్షుద్ర ప్రపంచంలోకి ఒక్కొక్కరినీ ఆహ్వానిస్తూనే వుంది.

❀




## చిరకాల స్నేహం

**మళ్ళీ చిరకాలస్నేహం చిగురులు తొడిగింది. 'రెయిన్‌కోట్' చిత్రం షూటింగ్‌లో చిరకాల మిత్రులు అజయ్ దేవ్‌గన్, ఐశ్వర్యారాయ్ పిచ్చాపాటీ మాట్లాడుకున్నారు. ప్రీతీష్‌నందీ కమ్యూనికేషన్స్ సంస్థ నిర్మిస్తున్న కొత్త చిత్రంలో ఆఫర్ కోసం ఒకరికొకరు రికమెండ్ చేసుకున్నారు. ఈ ప్రాజెక్టులో జాయెద్‌ఖాన్ కూడా ఒక భాగం అని తెలుస్తోంది. ఈ ఇద్దరు కలిసి నటించే చిత్రం పూర్తిస్థాయి ప్రేమ కథా చిత్రమే అవుతుందని ఇండస్ట్రీ వర్గాలంటున్నాయి.**

